నేడే ఈసెట్ పరీక్ష

- నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు నో ఎంట్రీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ రాతపరీక్ష సోమవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ పరిధిలో 46, ఇతర జిల్లాల్లో 40 కలిపి మొత్తం 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసెట్‌కు 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 7.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. ఉదయం తొమ్మిది గంటల వరకే అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరు. బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, హాల్‌టికెట్, ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును అభ్యర్థులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. క్యాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుల్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, పెద్ద కళ్లద్దాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఇతర పేపర్లను అనుమతి ఉండదు.

రేపు పాలిసెట్ పరీక్ష

- 1,06,716 మంది దరఖాసు
- 276 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2025 రాతపరీక్ష మంగళవారం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బిటిఇటి) కార్యదర్శి, పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పరీక్షను రాష్ట్రంలోని 276 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎంపిసి నుంచి 64,295 మంది, బైపిసి నుంచి 42,421 మంది కలిపి 1,06,716 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. విద్యార్థులను గంట ముందునుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌తో పాటు హెచ్‌బీ పెన్సిల్, ఎరేసర్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను తప్పకుండా తీసుకుని రావాలని సూచించారు. హాల్‌టికెట్ మీద ఫొటో ముద్రించని వారు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు ఆధార్ కార్డు (గుర్తింపు కార్డు) వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని పేర్కొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంజినీరింగ్,అగ్రి,ఫార్మా ఫలితాల్లో (ఎప్‌సెట్) శ్రీచైతన్య విద్యార్థులే విజయఢంకా మోగించారు. ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ రెండో ర్యాంకుతో పాటు మొదటి పది ర్యాంకుల్లో ఆరు ర్యాంకులు సాధించారు.అగ్రి ,ఫార్మాలో టాప్ 10లోపు 7 ర్యాంకులు..టాప్ 20లో 17 ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఇంజినీరింగ్‌లో రామచంద్రారెడ్డి రెండో ర్యాంకు, సూర్య కార్తిక్ మూడో ర్యాంకు, లక్ష్మీ భార్గవ్ నాలుగో ర్యాంకు, మంత్రి రెడ్డి ఐదో ర్యాంకు, సాయి రిషాంత్ రెడ్డి ఆరో ర్యాంకు, రుష్మిత్ ఏడో ర్యాంకు సాధించారు. ఫార్మాలో ఎస్ లలిత్ రెండో ర్యాంకు,అక్షిత్ మూడో ర్యాంకు,సాయినాథ్ నాలుగో ర్యాంకు,బ్రాహ్మణి ఐదో ర్యాంకు,అభిరంద్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్ రెడ్డిలు వరుసగా ఏడు,ఎనిమిది,పది ర్యాంకులు సాధించారు.ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంజినీరింగ్‌లో ఏడు సార్లు స్టేట్ ఫస్ట్, అగ్రి,ఫార్మాలో కూడా ఏడు సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ అన్నారు. ఈ ఫలితాల వెనక అధ్యాపకుల కృషితో పాటు శ్రీచైతన్య ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం, విద్యార్థుల కష్టం ఉందన్నారు. పోటీ పరీక్ష ఏదైనా తమ లవిద్యార్థులు ఇవే ఫలితాలు సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులను ఈ సందర్భంగా సుష్మా అభినందించారు.

కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే..

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలపై నిర్లక్ష్యం

- శిథిలావస్థలో 32 చేప ఉత్పత్తి కేంద్రాలు
- వాడుకలోకి తెస్తే ఇతర రాష్ట్రాలకు దిగుమతి చేయొచ్చు : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్య శాఖలోని కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే రాష్ట్రంలోని 32 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఫలితంగా ఇతర రాష్ట్రాల్లో నుంచి చేప పిల్లలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను వాడుకలోకి తెస్తే తెలంగాణలోని చెరువులు, కుంటలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ధ్వంసం చేసిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శేరిగూడలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పార్టీ జిల్లా నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. అక్కడి మత్స్యకార సంఘాల నాయకులతో చర్చించారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు, భూ విస్తీర్ణం, చేప పిల్లల మార్కెట్ నిర్మాణం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో నిర్లక్ష్యానికి గురైందని మత్స్యకారులు జాన్‌వెస్లీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వమే చేపల ఉత్పత్తిని నిలిపివేసిందన్నారు. చేపల మార్కెట్ నిర్మాణాన్ని ఆసరగా చేసుకుని ఉత్పత్తి కేంద్రాన్ని ధ్వంసం చేశారని చెప్పారు. ఆ కేంద్రాన్ని ధ్వంసం చేయకుండా పక్క స్థలంలో నిర్మాణం చేపట్టాలని తాము చెప్పినా వినకుండా ధ్వంసం చేశారని వివరించారు.

అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపల ఉత్పత్తికి 32 కేంద్రాల నిర్మాణం చేపట్టారని చెప్పారు. కాలక్రమేణా ఉత్పత్తి కేంద్రాలకు నిధులు కేటాయించకుండా, సిబ్బందిని నియమించకుండా నిర్లక్ష్యానికి గురిచేశారని తెలిపారు. రాష్ట్రంలో 6000 మత్స్యకార సొసైటీలు, సహకార సంఘాలు ఉన్నాయని, ఈ సంఘాల పరిధిలో సుమారు ఆరు లక్షల మంది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. ఒక్కో చేపల ఉత్పత్తి కేంద్రం సుమారు వెయ్యి చెరువులు, కుంటలకు చేప పిల్లలను ఎగుమతి చేసే స్థాయి కలిగి ఉన్నాయన్నారు. వాటిని వాడుకోకుండా కాకినాడ, భీమవరం ప్రాంతాల నుంచి చేప పిల్లలను దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. రూ.600 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు చెబుతున్నా సింహభాగం నిధులు కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళుతున్నాయని చెప్పారు. రూ.30 వేల కోట్ల వ్యాపారాన్ని మత్స్య కార్మికులు చేస్తున్నారని తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని అకారణంగా ధ్వంసం చేయడం సరికాదని, వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను వాడుకలోకి తేవాలని డిమాండ్ చేస్తూ పార్టీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్లను కలిసి వినతిపత్రాలను సమర్పిస్తామన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామని, అలాగే నేరుగా సిఎంను కలిసి విన్నవిస్తామని తెలిపారు. మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గొరెంకల నర్సింహ, లెల్లెల బాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, కందుకూరి జగన్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, సంఘం జిల్లా అధ్యక్షులు చెనమోని శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి తెలు ఇస్తారి, సిఐటియు జిల్లా నాయకులు పోచమోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ, పార్టీ నాయకులు

ఎప్‌సెట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

- రెండు విభాగాల్లో స్టేట్ ఫస్ట్ నారాయణ విద్యార్థులే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీరింగ్, అగ్రి/ ఫార్మా విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ భరత్ చంద్రతో పాటు బణి బ్రత ఎనిమిదో ర్యాంకు, శ్రీ కార్తీక్ పదో ర్యాంకు సాధించారు. వందలోపులో 39 ర్యాంకులు నారాయణ విద్యార్థులవే. అగ్రి/ ఫార్మా విభాగంలో సాకేత్ రెడ్డి స్టేట్ ఫస్ట్, శామ్యూల్ సాత్విక్ తొమ్మిదో ర్యాంకు సాధించారు. మొత్తంగా పది లోపు ఐదు, వందలోపు 54 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డా.పి సింధూర నారాయణ,పి శరణి మాట్లాడుతూ,విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశయాల సాధన నారాయణకే సాధ్యమని అన్నారు. నారాయణ విశిష్ట విద్యా ప్రణాళిక ద్వారానే ఇంతటి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.

జెఇఇ మెయిన్‌లో 300/300మార్కులు సాధించి ఆలిండియా ఓపెన్ కేటగిరిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన బణిబ్రత తెలంగాణకు చెందిన నారాయణ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులకు నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

నేడు టిజిఇఆర్‌సి సభ్యుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టిజిఇఆర్‌సి) నూతన సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మండలిలో టెక్నికల్ సభ్యులుగా కె రఘు, ఫైనాన్స్ సభ్యులుగా సిహెచ్ శ్రీనివాసరావును ప్రభుత్వ నియమించిన విషయం తెలిసిందే. వెంగళరావు నగర్‌లోని టిజిఇఆర్‌సి కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు వారు బాధ్యతలు స్వీకరించనున్నారు.

సాగుతున్న కొనుగోళ్లు

- రోజుల తరబడి రైతుల ఎదురుచూపులు
- వీడని అకాల వర్షాల భయం
- బీహారీ కూలీలు రాక ఆలస్యంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన ఇప్పటికీ రైతులు తమ ధాన్యం కొనుగోళ్ల కోసం రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితులే పలు చోట్ల దర్శనమిస్తున్నాయి. దాదాపు ఎనిమిది వేల కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా ఏప్రిల్ నుంచే కేంద్రాలను ప్రారంభించిన కొనుగోళ్లకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయకపోవడంతో పంటను తీసుకొచ్చిన రైతులు 10 నుంచి 15 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. హమాలీ కోసం గత కొన్నేళ్లుగా బీహార్ కూలీలే ఎక్కువగా వస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో స్థానికంగా కూలీలను సమకూర్చుకుంటున్నారు. ఈ ఏడాది స్థానికంగా వచ్చే ధాన్యం, అవసరమైన కూలీల సంఖ్య మేరకు ముందే సిద్ధం కాకపోవడం కూడా ఆలస్యానికి కారణంగా తెలుస్తున్నది.

అకాల వర్షాలు, ఇతర ఇబ్బందులు లేకుండా రైతుల వద్ద నుంచి పంటను కొనుగోలు చేయడం, వెంటనే చెల్లింపులు చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియ అనుకున్నంత వేగం పుంజుకోలేదు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ తదితర మండలాల్లో పంట కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాలను పరిశీలిస్తే, ఇప్పటికే కేంద్రానికి ధాన్యం తెచ్చి 10 రోజులపైగా ఎదురు చూస్తున్న రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లలో వేగం పెంచకపోతే, మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలంటే జూన్ 15 వరకు సమయం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈలోపు వర్షాలు పడితే తమ పరిస్థితి ఏంటని అలీప్ నగర్ కొనుగోలు కేంద్రంలో రైతులు ప్రశ్నిస్తున్నారు. మరో రెండకరాల రైతు ధాన్యం తెచ్చి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఎదురుచూడాల్సిన పరిస్థితి.

జూలూరులో రోజుకు 4 లారీల లోడ్ మాత్రమే వెళుండటంతో ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకు కూడా స్థలం దొరకడం లేదని మరో రైతు గువ్వల యాదగిరి వాపోయారు. లారీలు సమయానికి రావడం లేదనీ, తాలు, తవుడు తదితర సమస్యలను ఎదుర్కొంటున్నట్టు కొమ్ము బుచ్చమ్మ చెప్పారు. బీబీనగర్ మండలం రుద్రవెల్లి, రాఘవపూర్ కొనుగోలు కేంద్రంలోనూ ఇందుకు భిన్నమైన పరిస్థితి ఏం లేదు. గతేడాది ఇదే సీజన్‌లో ఈ కేంద్రంలో 53 వేల బస్తాలను సేకరించగా, ప్రస్తుతం అదే మోతాదులో ధాన్యం వస్తుందనే అంచనా ఉంది. ఇక్కడ కేంద్రం ఏప్రిల్ 30న ప్రారంభం కాగా మే చివరి వరకు కొనుగోళ్లు కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. కేంద్రానికి 90 మంది రైతులు ధాన్యం తీసుకురాగా, 25 మంది నుంచి కొనుగోలు చేయగా, మరో 65 మంది ఎదురుచూస్తున్నారు. మొత్తంగా ఆ జిల్లాతో పాటు, రాష్ట్రంలోనూ గతంలో కన్నా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తొందరగా ప్రారంభించినప్పటికీ, అదే స్థాయిలో వేగంగా కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియలో ఆలస్యమవుతున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం జోక్యం చేసుకుని కొనుగోళ్ల వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి మాటూరి బాల్ రాజ్ గౌడ్

కేంద్రాల్లో రైతులు నుంచి ధాన్యాన్ని సాధ్యమైనంత తొందరగా కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం యాదాద్రి-భువనగిరి జిల్లా కార్యదర్శి మాటూరి బాల్ రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. కూలీల సమస్య, లారీల కొరత లాంటివి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పలు కేంద్రాల్లో కనీసం సగం ధాన్యం కొనుగోలు కూడా పూర్తి కాలేదని తెలిపారు. మరోవైపు మిగిలిన రైతులు అకాల వర్షాల భయం పట్టుకుందని చెప్పారు. అదే జరిగితే ఆరబోసిన ధాన్యం ఏమౌతుందనే ఆందోళనతో ఉన్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణవాసుల రాక

- కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లోని తెలంగాణవాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ కు మొత్తం 126 మంది రాగా, అందులో 91 మంది శనివారం అర్ధరాత్రి నుంచి వచ్చిన వారే ఉండటం గమనార్హం. వీరిలో శ్రీనగర్ ఎన్ఐటికి చెందిన 50 విద్యార్థులతో పాటు షెర్ ఇ కాశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ విద్యార్థులు, బోధనా సిబ్బంది, జమ్ముకాశ్మీర్ లో పని చేస్తున్న ఉద్యోగులు, పంజాబ్ లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు, ఇతర సరిహద్దు ప్రాంతాల్లోని విద్యార్థులు, నివసిస్తున్న తెలంగాణవాసులున్నారు. వీరిలో 57 మందిని ఇప్పటికే వారి స్వస్థలాలకు పంపించారు. వారికి ఉచిత భోజనం, వసతి, మెడికల్ ఎయిడ్, రవాణా సౌకర్యాలను కల్పించారు. రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సహాయ కార్యక్రమాలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం మరికొంత మంది రావచ్చని భావిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చిక్కుకున్న వారంతా తమ స్వస్థలాకు క్షేమంగా చేరుకునే వరకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు.

నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

- వచ్చే నెల చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి నుంచి రాష్ట్రంలోని మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే కొనుగోలు, అమ్మకందార్లు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించవలసిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామనీ, అక్కడ విజయవంతం కావడంతో రెండవ విడతలో మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సిబ్బందిని నియమిస్తామనీ, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నియమించడం జరిగిందని తెలిపారు. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీనం విజయవంతం కావడంతో షాద్‌నగర్, ఫారూక్ నగర్ సిద్దిపేట, సిద్దిపేట (రూరల్) కార్యాలయాలను విలీనం చేయడం జరిగిందని వివరించారు.

స్లాట్ బుకింగ్ అమలు కానున్న కార్యాలయాలు

హైదరాబాద్ ఆర్ఓ. ఆర్ఓ సౌత్, నారపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట, సిద్దిపేట రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్ఓ, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్ఓ. ఆఫీసు, షాద్‌నగర్, ఫరూక్ నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి.

నిర్లక్ష్యం మాటున.. 'విషం'

- ఇష్టారాజ్యంగా మిరప తొడిమెల కాల్చివేత
- పొగతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- మిర్చి కల్లాల వ్యాపారుల ఇష్టారాజ్యం !
- ఇదీ వరంగల్ ఎనుమాముల మార్కెట్ దుస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కల్లాల వ్యాపారుల నిర్లక్ష్యం వల్ల స్థానిక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. కల్లాల వద్దే మిర్చి తొడిమెలు కాల్చడంతో దుర్వాసన, పొగ వల్ల ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్కెట్ సమీపంలోని ఎనుమాముల, ఎన్టీఆర్‌నగర్, సుందరయ్యనగర్, రెడ్డిపాలెం, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులు, దగ్గు, దమ్ము, ఉబ్బసం, అస్తమాతోపాటు కంటి జబ్బుల బారిన పడుతున్నారు. ఇదే విషయమై స్థానిక నాయకులు, ప్రజలు పలుమార్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మిర్చి కల్లాల యజమాన్యంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. దాంతో మిర్చి కల్లాల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆగని మంటలు.. పట్టించుకోని 'మున్సిపల్'

ఎనుమాముల మార్కెట్ సమీపంలో గత బుధవారం రాత్రి సుమారు 10గంటల సమయంలో లాలా ట్రేడర్స్ యజమాని తన మిర్చి కల్లం వద్ద తొడిమెలు కాల్చగా మంటలతో దట్టంగా పొగ చూరి చుట్టు పక్కన ఉన్న కాలనీలకు వ్యాపించాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనుమాముల పోలీసులకు తెలిపారు. వెంటనే స్పందించిన సీఐ రాఘవేందర్ ఫైర్ ఇంజన్‌ను రప్పించి అగ్నిమాపక సిబ్బందితో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంటలు చల్లారకపోవడంతో ఫైరింగ్ సిబ్బంది సూచన మేరకు పోలీసులు జేసీబీ, డోజర్‌లను తెప్పించి సుమారు మూడు గంటలు తీవ్రంగా శ్రమించి అతి కష్టం మీద మంటలను అదుపు చేశారు. దాంతో పరిసర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా ఏటా ఘటనలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు. మున్సిపాలిటీ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు పాటించని వ్యాపారుల కల్లాలను సీజ్ చేయాల్సిన మున్సిపల్ అధికారులు కూడా కన్నెత్తి చూడకపోవడం పట్ల ఆరోపణలొస్తున్నాయి.

సరస్వతీ పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరస్వతీ నది పుష్కరాల్లో నాణ్యత పాటించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో వీఐపీ ఘాట్, సరస్వతీ మాతా విగ్రహం, జ్ఞానతీర్థం, నదిలో యాత్రికుల స్నానమాచరించే ప్రదేశం, టెంట్ సిటీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం టెంట్ సిటీలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేయాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయని, నాణ్యతతో వేగంగా పూర్తిచేయాలని తెలిపారు. పట్టణం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలని 12 రోజులు పండుగ వాతావరణం కనిపించాలని సూచించారు. సరస్వతీ మాత విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరణ చేయాలన్నారు. పిండ ప్రధాన భవనం అసంపూర్తిగా ఉందంటూ దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హారతి కార్యక్రమానికి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు నదిలోకి వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నది వద్ద 50మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతోపాటు నాటుపడవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా మొట్టమొదటిసారిగా కాళేశ్వరంలో టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం వస్తున్నారని, అలాగే తదుపరి రోజుల్లో గవర్నర్, మంత్రులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహదేవపూర్ నుంచి వీధిదీపాలు ఏర్పాటుతో పాటు డివైడర్లు మధ్యలో స్ట్రిప్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద తాత్కాలిక లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఒక్క నిమిషం కూడా కరెంటు పోవద్దని కాటారం, బీరసాగర్ నుంచి విద్యుత్ సరఫరా తీసుకోవాలని తెలిపారు. దేవాలయం, 100 గదుల సత్రంలో జనరేటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మెయిన్ ఘాట్ వద్ద ఆర్చి స్లాబు వేశారని, పుష్కరాలు దగ్గర పడుతున్న సమయంలో ఎందుకు స్లాబు వేశారని, పని ఎలా అయిపోతుందో చెప్పాలంటూ దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ట్రాఫిక్ ప్లాన్ పక్కగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ వెంకటరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులపై నజర్..!

- మరో మూడు రోజుల్లో వాహన సామర్థ్య పరీక్షలు షురూ
- ప్రతి సంవత్సరం మొక్కుబడిగానే తనిఖీలు.. ఎఫ్‌సిల జారీ
- రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులను చేరవేసే బస్సుల ఫిట్‌నెస్‌పై రాష్ట్ర రవాణాశాఖ ప్రత్యేక నజర్ పెట్టింది. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఫిట్‌నెస్ లేకుండా విద్యాసంస్థల బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతున్నారు. ఈనెల 15తో స్కూల్, కాలేజ్ బస్సుల ఫిట్‌నెస్ ముగియనుంది. ఈ నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను నిర్ణీత సమయంలోపు ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలి. కానీ ఏటా అది సరిగ్గా అమలు కావడం లేదు. ఫలితంగా వందలాది బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా.. ఎఫ్‌సీలు లేకుండా రోడ్డుకెక్కుతున్నాయి. ఆ తర్వాత ప్రమాదాలు జరిగో.. అధికారుల తనిఖీల్లోనూ పట్టుబడుతున్నాయి. అయితే ఈ ఏడాది రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు విద్యాసంస్థల యాజమాన్యాలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి.. అందులో పిల్లలు భద్రత, ఫిట్‌నెస్, రోడ్డు సేఫ్టీపై వారికి అవగాహన కల్పించనున్నారు. ఆ తర్వాత ఫిట్‌నెస్ లేకుండా దొరికితే బస్సులను సీజ్ చేయడంతో పాటు సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తారు. రాష్ట్రంలో దాదాపు 28వేలకుపైగా విద్యాసంస్థల బస్సులుండగా.. వీటిలో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో 13వేల వరకు పాఠశాలలు, కళాశాలల బస్సులున్నాయి. వీటిలో కాలం చెల్లిన బస్సులు మినహాయిస్తే.. రాష్ట్రంలో 23వేలకుపైగా బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 15 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే విద్యాసంస్థల ప్రతి బస్సు ఫిట్‌నెస్ తనిఖీలకు వచ్చి, సర్టిఫికెట్ పొందేలా యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత చేయించుకోని వారికి నోటీసులు జారీ చేయనున్నారు. బస్సులతోపాటు వ్యాన్లు, ఆటోలపై కూడా దృష్టిపెట్టనున్నారు. వాటి డ్రైవర్లకు కూడా ఫిట్‌నెస్, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వీటిలో డ్రైవర్లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనేలా చర్యలు తీసుకోనున్నారు. కాగా గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని కార్యాలయాలల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తారు. ఎంవీఐ, ఏవీఎంఐ, కానిస్టేబుల్స్, హోంగార్డులతో కూడిన ప్రత్యేక బృందాలు స్కూల్, కాలేజ్ బస్సులను తనిఖీ చేస్తారు.

ప్రతి బస్సు ఆఫీస్‌కు రావాల్సిందే..!

గ్రేటర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు సంబంధించినవి 23వేలకుపైగా బస్సులున్నాయి. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫిట్‌నెస్‌తో ఉన్న వాహనాలు మాత్రమే రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది. అధికారులు ఎన్ని జాగ్రత్తలు పాటించినా గతేడాది పలు విద్యాసంస్థలకు చెందిన వందలాది బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవడానికి కార్యాలయానికి రాలేదు. పక్కా ప్రణాళికతో పకడ్బందీగా ఫిట్‌నెస్ డ్రైవ్ చేపట్టినా కొన్ని బస్సులు దూరంగా ఉన్నాయి. చాలావరకు దొంగచాటుగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సుల నంబర్లను పెట్టుకొని రోడ్లపై తిరుగుతున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో కూడా అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. వాహనాలు కార్యాలయాలకు రాకుండానే వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇటువంటి ఆరోపణలకు తావులేకుండా ఉండేందుకు గ్రేటర్ పరిధిలోని అధికారులతో పాటు రాష్ట్రంలోని ఆయా అధికారులు తమ జిల్లాల పరిధిలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిట్‌నెస్ కోసం ప్రతి వాహనం కార్యాలయానికి రావాల్సిందేనని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రూల్స్ ఇలా..

నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాల, కళాశాల బస్సులకు రవాణా శాఖ సామర్థ్య పరీక్షలు నిర్వహించడం తెలిసిందే. ఈ పరీక్షల్లో భాగంగా.. బ్రేకులు, ఇంజన్ పనితీరు, డోర్లు, డ్రైవర్ అనుభవం తదితర అంశాలను పరిశీలిస్తారు. డ్రైవర్‌కు కనీసం అయిదేండ్ల అనుభవముండాలి. డ్రైవర్ లైసెన్స్‌తోపాటు క్లీనర్ ఫొటోలు, ఫోన్ నంబర్లు వాహనంలో ఉన్నాయా లేదా అనేది చూస్తారు. ఎంతమంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారనే లెక్కని, వారి తల్లితండ్రుల ఫోన్ నంబర్లు సహా బస్సులో అతికించాలి. బస్సు రూట్‌మ్యాప్‌ని ఆర్టీఏ కార్యాలయంలో అందజేయాలి. పదిహేనేండ్లు దాటిన వాహనాలను అనుమతించరు. విద్యాసంస్థల బస్సులకు పసుపురంగు వేసి నాలుగు వైపులా ఆర్టీఏ రిజిస్ట్రేషన నంబర్ రాయాలి. కొత్త టైర్లతోపాటు స్టెప్నీ ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ తప్పనిసరి. వర్షంపడితే నీళ్లు లోపలికి రాకుండా ఉండేందుకు బస్సు టాప్‌పై సీలింగ్ ఉండాలి. ప్రతి మూడునెలలకోసారి డ్రైవర్ వైద్య పరీక్షలు చేసుకోవాలి. ఈ ఖర్చు యాజమాన్యామే భరించాలి. అలాగే డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలి. ఇలా మొత్తం 30-40 నియమ నిబంధనలను పాటించిన బస్సులకు మాత్రమే ఎఫ్‌సీ మంజూరు చేస్తారు.

వడదెబ్బతో అడ్డా కూలీ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ముందున్న లేబర్ అడ్డా వద్ద ఎండ తీవ్రతతో అలసిపోయి, వడదెబ్బ తగలడంతో కూలీ దుర్గం బాలయ్య (49) మృతి చెందారు. మాసాయిపేట మండలం పోతాన్ పల్లి గ్రామానికి చెందిన దుర్గం బాలయ్య లేబర్ అడ్డా కూలీగా పని చేసే వాడు. రోజులాగే శనివారం ఉదయం లేబర్ అడ్డాపై కూలీగా వెళ్లి రోజంతా ఎండలో సాయంత్రం వరకు పనిచేశాడు. ఎండ తీవ్రతతో అలసిపోయి, వడదెబ్బతో అడ్డా వద్దనే స్పృహతప్పి పడిపోయాడు. శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో లేబర్ అడ్డాపై ఒక వ్యక్తి పడిపోయి ఉండడాన్ని గమనించారు. అనంతరం పోలీసులు అతని దగ్గరికి వెళ్లి చూడగా, వడదెబ్బతో చనిపోయినట్టు గుర్తించి మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఈ విషయాన్ని పోలీసులు వాట్సాప్‌లో పెట్టడంతో సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆదివారం బాలయ్య భార్య, కుమారులు మల్లేశ్, శేఖర్ వచ్చి దుర్గం బాలయ్యగా గుర్తించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివానందం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లికుట్ల రాజకీయాలు మానుకో

- ఎంపి ఈటలకు జగ్గారెడ్డి హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఖండించారు. బిజెపిలో కీలక పదవి కోసం నల్లికుట్ల రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సీఎంపై లూజ్ కామెంట్లు చేస్తే బట్టలిప్పి నడిరోడ్డులో గుంజీలు తీయిస్తానని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో సమస్యలున్నాయనీ, వాటిని పరిష్కరించాలంటూ ఎప్పుడైనా సీఎం దగ్గరకు పోయి అడిగావా? అని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా సార్లు సీఎంపై నోరు జారావు...జాగ్రత్త అని ఈటలను హెచ్చరించారు. సీఎంను తిడితే బీజేపీ అధ్యక్ష పదవి వస్తుందనుకుంటున్నావేమో? ఆ పదవి రాదనే సంగతి మరచిపోవద్దని గుర్తు చేశారు. సీఎంపై పరిధి దాటి మాట్లాడితే, తాను మాట్లాడాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు.

ఎప్‌సెట్ టాపర్లు అబ్బాయిలే

- ఇంజనీరింగ్ టాప్‌టెన్‌లో అంతా వారే
- ఏపికి చెందిన పల్లా భరత్ చంద్ర టాపర్
- అగ్రికల్చర్, ఫార్మసీ టాప్‌టెన్‌లో ఒక్కరే అమ్మాయి
- మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డి ప్రథమం
- ఇంజనీరింగ్‌లో 73.26 శాతం, అగ్రికల్చర్‌లో 87.82 శాతం అర్హత
- ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల ఫలితాలను ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో ఆదివారం విడుదల చేశారు. ఎప్‌సెట్ ఫలితాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకులను సాధించారు. టాప్ టెన్ ర్యాంకుల్లో ఇంజనీరింగ్ విభాగంలో పది మంది అబ్బాయిలే సాధించడం గమనార్హం. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో తొమ్మిది మంది అబ్బాయిలుంటే, ఒక్కరే అమ్మాయి ఉన్నారు. ఇంజనీరింగ్ విభాగం టాప్ టెన్ ర్యాంకర్లలో ముగ్గురు ఎపి విద్యార్థులున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో టాప్ పది ర్యాంకుల్లో అందరూ తెలంగాణ విద్యార్థులే ఉండడం గమనార్హం. ఇంజనీరింగ్ విభాగంలో 150.058429 మార్కులతో ఎపిలోని మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పల్లా భరత్ చంద్ర మొదటి ర్యాంకును సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 141.688297 మార్కులతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన సాకేత్‌రెడ్డి పెద్దక్కగారి ప్రథమ ర్యాంకును పొందారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,20,326 మంది దరఖాస్తు చేస్తే, 2,07,190 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 1,51,779 (73.26 శాతం) మంది అర్హత సాధించారు. ఇందులో 94,109 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 88,139 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 65,120 (73.88 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 1,26,217 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 1,19,051 మంది పరీక్ష రాశారు. వారిలో 86,659 (72.79 శాతం) మంది అర్హత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో అబ్బాయిల కంటే అమ్మాయిలు 1.09 శాతం మంది అధికంగా ఉత్తీర్ణులయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి 86,762 మంది దరఖాస్తు చేయగా, 81,198 మంది పరీక్ష రాశారు. వారిలో 71,309 (87.82 శాతం) మంది అర్హత పొందారు. ఇందులో 65,469 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 61,331 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 54,166 (88.32 శాతం) మంది అర్హత సాధించారు. 21,293 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 19,867 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 17,143 (86.29 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులోనూ అబ్బాయిల కంటే అమ్మాయిలు 2.03 శాతం మంది అధికంగా అర్హత పొందారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎపి విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు కాదు : బాలకిష్టారెడ్డి

ఎపి విద్యార్థులు తెలంగాణలో ప్రవేశాలకు అర్హులు కాదని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగం రాతపరీక్షలో ఎపి విద్యార్థులు ర్యాంకులు సాధించిన ఇక్కడ సీట్లు పొందలేరని వివరించారు. ఎపి విద్యార్థులకు ర్యాంకు వచ్చినంత మాత్రాన ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం పదేళ్ల ఉమ్మడి రాజధాని హైదరాబాద్ ఉన్నందున గత విద్యా సంవత్సరం వరకు ఎపి విద్యార్థులకు కూడా సీట్లు కేటాయించామని చెప్పారు. ఇప్పుడు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా లేదనీ, దీంతో ఎపి విద్యార్థులకు తెలంగాణలో సీట్లు కేటాయించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఎప్‌సెట్ టాప్‌టెన్ ర్యాంకుల వివరాలు

ర్యాంకు	అభ్యర్థి పేరు	మార్కులు	జిల్లా
	ఇంజనీరింగ్ విభాగం		
1	పల్లా భరత్ చంద్ర	150.058429	మన్యం, పార్వతీపురం, ఏపీ
2	ఉడగండ్ల రామచరణ్‌రెడ్డి	148.284029	రంగారెడ్డి, తెలంగాణ
3	పమ్మిన హేమ సాయి సూర్య కార్తీక్	147.085966	విజయనగరం, ఏపీ
4	లక్ష్మి భార్గవ్ మెండె	146.150845	హైదరాబాద్, తెలంగాణ
5	మంత్రిరెడ్డి వెంకట గణేష్ రాయల్	144.053382	రంగారెడ్డి, తెలంగాణ
6	సుంకర సాయి రిషాంత్‌రెడ్డి	143.723785	రంగారెడ్డి, తెలంగాణ
7	రుష్మిత్ బండారి	142.579622	రంగారెడ్డి, తెలంగాణ
8	బనిబ్రత మాజీ	141.084897	రంగారెడ్డి, తెలంగాణ
9	కొత్త ధనుష్‌రెడ్డి	140.24602	రంగారెడ్డి, తెలంగాణ
10	కొమ్మ శ్రీ కార్తీక్	138.257604	మేడ్చల్,మల్కాజిగిరి, తెలంగాణ
	అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం		
1	సాకేత్‌రెడ్డి పెద్దక్కగారి	141.688297	మేడ్చల్ మల్కాజిగిరి, తెలంగాణ
2	సబ్బని లలిత్ వరేణ్య	140.477712	కరీంనగర్, తెలంగాణ
3	చాడ అక్షిత్	140.00081	వరంగల్, తెలంగాణ
4	పెద్దింటి రాచాల సాయినంద్	138.823946	వనపర్తి, తెలంగాణ
5	బ్రాహ్మణి రెండ్ల	138.710191	రంగారెడ్డి, తెలంగాణ
6	గుమ్మడిదల తేజస్	137.82964	మేడ్చల్ మల్కాజిగిరి, తెలంగాణ
7	కొలన్ అఖిరానంద్‌రెడ్డి	137.635667	హైదరాబాద్, తెలంగాణ
8	భానుప్రకాశ్‌రెడ్డి సాధు	136.702087	రంగారెడ్డి, తెలంగాణ
9	అర్జా శామ్యూల్ సాత్విక్	136.674587	రంగారెడ్డి, తెలంగాణ
10	శశికిరణ్‌రెడ్డి అద్దుల	136.494315	రంగారెడ్డి, తెలంగాణ

తెలంగాణ వాసులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు రాష్ట్రాల నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోందని రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇప్పటివరకు 86 మంది తెలంగాణవాసులు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వారిలో 26 మందికి అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించాం. ఇంకా దాదాపు 100 మందికిపైగా తెలంగాణ భవన్‌కు చేరుకునే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లను చేస్తున్నాం. భోజన వసతి, వైద్య, రవాణా తదితర ఏర్పాట్లను చేశాం. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందిస్తోంది' అని తెలిపారు.

వీడియోకాల్‌లో మహేష్‌తో మాట్లాడుతున్న కెటిఆర్

మహేష్‌ను ఇండియాకు రప్పించి అన్ని విధాలా ఆదుకుంటా

- ఎమ్మెల్యే కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బాధపడకండి.. బాధ్యత నేను తీసుకుని మహేష్‌ను ఇండియాకు తీసుకొచ్చి అన్ని విధాలా ఆదుకుంటానని' గల్ఫ్ బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త మంద మహేష్ జీవనోపాధి కోసం గల్ఫ్‌లోని సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన కుటుంబాన్ని కెటిఆర్ ఆదివారం పరామర్శించారు. సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌తో వీడియో కాల్‌లో కెటిఆర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని మహేష్‌కు ధైర్యం చెప్పి, మనోళ్లను పంపించి అండగా ఉండే విధంగా అన్ని రకాలుగా చూస్తానని కుటుంబానికి భరోసానిచ్చారు. సొంత ఖర్చులతో ఇండియాకు రప్పిస్తానని తెలిపారు.

అమ్మకు వందనం

ప్రజాశక్తి కల్చరల్

అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక నిర్వహణలో ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా శ్రీ త్యాగరాయ గానసభలో గాన సభ సౌజన్యంతో అమ్మలకు సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో తల్లి తరువాతే తండ్రి గురువు అని నేర్పిందన్నారు తల్లి కనిపించే దైవం అని చెప్పారు హక్కులు వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వికలాంగులైన పిల్లలను సైతం కంటికి రెప్పలా కాపాడుతూ పెంచే ఓర్పు తల్లికే ఉంటుందని అన్నారు. తల్లులకు చీరెలు పంపిణీ చేశారు. రామచందర్ జంగిల్ శ్రీనివాస్ పవన్ ఉమ సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు అనువాద సాహిత్యం కీలకం

ప్రజాశక్తి కల్చరల్

దేశంలోని వివిధ భాషా సాహిత్యాలు వేరు వేరు భాషలలో అనువాదం జాతీయ సమైక్యతకు దోహదం చేస్తుందని ప్రముఖ హిందీ కవి బన్వర్ లాల్ అగర్వాల్ స్నేహి అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దీప శిఖ దీప్తి ప్రకాశ నిర్వహణలో ఆయన రచించిన హిందీ గ్రంథాల అనువాదాలు అద్దం అబద్ధం ఆడదు క్షణాలు పరిమళం సంపుటిల ఆవిష్కరణ సభ జరిగింది. సంపుటిలను ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. హిందీ నుంచి తెలుగులోకి అనుసృజన చేసిన లక్ష్మణా చార్యులు కవి ఆలోచనలు భావనకు భంగం కలుగని రీతిలో అనువాదం చేశారు అని అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ నాగేశ్వరరావు సారథ్యంలో జరిగిన కవి సమ్మేళనం లోఅబ్దుల్ రషీద్, మండపాక అరుణ కుమారీ, పరమేశ్వర్ తదితరులు హిందీ తెలుగు ఉర్దూ భాషలో కవితలు చెప్పారు. పాటలు ఆలపించారు. విద్యా వేత్తలు సామాజిక వేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అనువాదం సాహిత్య ప్రాధాన్యం నొక్కి చెప్పారు.

బుద్ధవనాన్ని సందర్శించనున్న మిస్ వరల్డ్ పోటీ దారులు

- ఏర్పాట్లు చేసిన తెలంగాణ పర్యాటక శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన కొంత మంది సుందరాంగులు నాగార్జునసాగర్ సమీపంలోని బుద్ధవనాన్ని నేడు సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి నల్లగొండ జిల్లా చింతపల్లి సమీపంలో ఉన్న అతిథి గృహం వద్ద కొద్ది సేపు ఆగుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి విజయ్ విహార్ చేరుకుంటారు. అక్కడ ఫోటో సెషన్ తర్వాత బుద్ధవనం చేరుకుంటారు. బుద్ధవనం ప్రాముఖ్యతను పురావస్తు శాఖ ప్రతినిధులు వారికి వివరించనున్నారు. అనంతరం జాతక వనాన్ని సందర్శించి రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు.

కొల్లాపూర్ బేనీషాన్ ఢిల్లీకి తరలింపు

- సరిహద్దులు దాటుతున్న కొల్లాపూర్ మామిడి
- రైతుల నుంచి బలవంతంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- స్థానిక ప్రజలకు రాలిన, పుచ్చుపోయిన పండ్లే దిక్కు
- నిలువునా నష్టపోతున్న రైతులు, కొనుగోలుదారులు
- స్థానికంగా అమ్ముకోనివ్వని వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లమలలో పుట్టిన బంగినపల్లి మామిడి ఢిల్లీకి తరలిస్తున్నారు. ఈ ప్రాంతం వారు కొనుగోలు చెద్దామన్నా.. ఏజెన్సీలు, బడా వ్యాపారస్తులు రైతుల దగ్గర బలవంతంగా కొనుగోలు చేసి ఢిల్లీ, మహారాష్ట్ర, ముంబాయితో పాటు అమెరికా, జర్మనీ అరబ్ దేశాలకు చేరవేస్తున్నారు. కొల్లాపూర్ బేనీషాన్ పండ్ల తోటలు నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. ఇక్కడ దిగుబడి అయిన పండ్లను ఈ ప్రాంతం వారికి దక్కకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో మామిడి సీజన్ జోరుగా సాగుతున్న సమయంలో వ్యాపారుల ఆగడాలు పెచ్చరిల్లుతున్నాయి. మామిడి తోటల్లో పండ్లను కేజీకి రూ.30 పెట్టి బడా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇక్కడి వారు మామిడి పండ్లను కొనుగోలు చేయాలంటే రూ.80లు పెట్టాల్సి వస్తోందని వినియోగదారులు తెలిపారు.

వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లో ఈ ఏడాది మామిడి దిగుబడి సగానికి పైగా పడిపోయింది. పదెకరాలకు పది టన్నుల దిగుబడి రావాలి. అయితే ఈసారి నాలుగు టన్నుల దిగుబడి కూడా రావడం లేదు. వచ్చిన దిగుబడిని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. కొల్లాపూర్ బేనీషాన్‌ను కొనుగోలు చేయడానికి పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బడా వ్యాపారులు ఇక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన మామిడిని ఇక్కడే ప్యాక్‌చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పండ్ల మార్కెట్‌కు మామిడి రావడంతో వారం రోజులుగా మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు మామిడిని తరలిస్తున్నారు. ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాలో మామిడి పండ్ల కొరత రాకుండా ఇక్కడ కొంత అమ్ముకుంటూ మిగిలిన సరుకును హైదరాబాద్ తరలించేవారు. ఈసారి అలా కాకుండా వ్యాపారులు బేనీషాన్ మామిడిని కొనుగోలు చేసి బెంగుళూరు, ముంబాయి, గుజరాత్, కోయంబత్తూరుతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి కొనుగోళ్లలో రైతులను కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు నిలువునా ముంచుతున్నారు. కోటి జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి సరిపడే పండ్లు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుండే సరఫరా అవుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో మామిడి తోటలు 70వేల ఎకరాలకు పైగానే ఉన్నాయి. నారాయణపేట, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలో మరో 50 వేల ఎకరాల మామిడి తోటలున్నాయి. ఇక్కడి నుంచి వచ్చే మామిడికాయ మొత్తం పూర్తిగా స్థానికంగా గాకుండా ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు.

పక్క రాష్ట్రాలకు రూ.30, ఇక్కడి వారికి రూ 80

మహబూబ్‌నగర్‌లో సాగైన బేనీషాన్ మామిడికి మంచి గిరాకీ ఉంది. శ్రీశైలం, హైదరాబాద్, కర్నూల్ వారు ఇక్కడి నుంచి పండ్లను తీసుకొని వెళ్తుంటారు. గత రెండేండ్లుగా మామిడి దిగుబడి భారీగా తగ్గింది. దాంతో మామిడి కాయలకు కొరత ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో మామిడి కాయలను ఖరీద్ చేయడానికి దళారీ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి అతి తక్కువ ధరకు మామిడికాయలను కొని ఇతర దేశాలు, ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతుల నుంచి వ్యాపారులు కిలో రూ. 30 ఖరీదు చేసి అవే పండ్లను ఇక్కడే కిలో రూ. 80కు అమ్ముతున్నారు. మచ్చలేని కాయలు ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి వారికి నాణ్యమైన మామిడి పండ్లు దొరకడం గగనంగా మారింది. బేనీషాన్ మామిడి పండ్లు రైతులకు కరువయ్యాయి. కొల్లాపూర్ బేనీషాన్ పండ్లను కొనుగోలు చేయడానికి ఎంఎఫ్‌సీ కంపెనీ వారు పెద్దకొత్తపల్లిలో తిష్టవేశారు. తోతాపరి కిలో రూ.20, బేనీషాన్ రూ. 30, కేసరి రూ. 40, దసేరి రూ. 40.. ఇలా తక్కువ ధరకు కంపెనీలు ఖరీదు చేసి అధిక ధరకు అమ్ముతున్నారు. దాంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. చూటు పేరుతో 10 క్వింటాళ్లకు 1 క్వింటా అదనంగా తూకం చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. సన్న కాయ, మచ్చలు వచ్చిన కాయ పేరుతో మరింత ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

మాకు అధిక ధరలకు అమ్ముతున్నారు : నారమ్మ, కొల్లాపూర్

బయటకు మాత్రం కిలో రూ.30లకు అమ్మి మాకు రూ. 60లకు అమ్ముతున్నారు. అందుకే మేము అధిక ధరలకు అమ్మవలసి వస్తోంది. లీజుకు తీసుకున్న తోటల వాళ్లం అధికంగా నష్టపోతున్నాం.

రైతుల వద్ద ఖరీదు చేసి ఢిల్లీకి పంపుతున్నాం : భారీమోద్దీన్, మామిడి కాయల ఎగుమతిదారుడు

రైతుల వద్ద ఖరీదు చేసి ఢిల్లీ పంపిస్తున్నాం. వారు అక్కడి నుంచి ఇతర దేశాలైన అమెరికా, అరబ్ దేశాలకు పంపిస్తారు. మచ్చలేని కాయలకు మంచి రేటు ఉంటుంది. ముఖ్యంగా ఈ ప్రాంత బేనీషాన్, తోతాపరి, దసేరి వంటి పండ్లకు ఇతర ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉంది.

పోలీసుల అత్యుత్సాహం..

- యువతిని కిడ్నాప్ చేశావంటూ యువకుడ్ని చితకబాదిన పోలీసులు..
- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు నవీన్
- కనగల్ ఎస్ఐ, కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసిన తల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పట్టణం పానగల్లుకు చెందిన యువతిని కిడ్నాప్ చేశారన్న ఆరోపణతో కనగల్ ఎస్ఐ విష్ణు, కానిస్టేబుల్ బురహన్ ఉద్దీన్.. అదే ప్రాంతానికి చెందిన కుంచం నవీన్‌ను చితక బాదడంతో నవీన్ తీవ్ర అస్వస్థతకు గురై నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆదివారం వెలుగులోకొచ్చింది. నవీన్ తల్లి యాదమ్మ.. కనగల్ ఎస్ఐ విష్ణు, కానిస్టేబుల్ బురహన్ ఉద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్లగొండ పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పానగల్లుకు చెందిన నవీన్, అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ యువతి ఈ నెల 9వ తేదీన దామరచర్లలో పని చేసుకుంటున్న నవీన్‌ను రమ్మని ఫోన్ చేసింది. దాంతో నవీన్ ఆ యువతి అమ్మమ్మ ఊరైన కనగల్ మండలంలోని పర్వతగిరికి వెళ్లాడు. అక్కడ యువతి, నవీన్ మాట్లాడుకున్నారు. అక్కడి నుంచి నవీన్ తిరిగి దామరచర్లకు వెళ్లిపోయాడు. కాగా, నవీన్‌కు కనగల్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్ బురహాన్ ఉద్దీన్ ఫోన్ చేసి యువతిని కిడ్నాప్ చేశావంటూ కనగల్ పోలీస్ స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. రేపు ఉదయం స్టేషన్‌కి వస్తానని నవీన్ చెప్పాడు. అదేమీ పట్టించుకోకుండా అదే రోజు రాత్రి కానిస్టేబుల్‌తో పాటు యువతి బంధువులు నలుగురు నవీన్ ఇంటిపై దాడి చేసి అర్ధరాత్రి నవీన్‌ను కొట్టుకుంటూ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఎస్ఐ విష్ణు నవీన్‌ను సెల్‌లో వేసి చితకబాదారు. ఆ యువతి హైదరాబాద్ నుంచి ఫోన్ చేసిందంటూ పదో తేదీ ప్రయివేట్ వాహనంలో సికింద్రాబాద్‌కు తరలించారు. విచారణ పేరుతో తీవ్రంగా కొట్టారు. పదో తేదీ రాత్రి మొత్తం కారులో తిప్పుతూ చితకబాదారు. ఆదివారం ఉదయం 12 గంటల సమయంలో స్టేషన్‌కు తీసుకొచ్చి యువతి తండ్రి, బంధువులు తీవ్రంగా హింసిస్తూ చితక కొట్టారు. దాంతో నవీన్ స్పృహ తప్పి పడిపోయాడు. స్టేషన్ బయట ఉన్న నవీన్ బంధువులను పిలిపించి ఆస్పత్రికి తీసుకెళ్లండని చెప్పినట్టు నవీన్ తల్లి యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా నవీన్, ఆ యువతి కొంతకాలంగా ఒకరికొకరు ఇష్టపడ్డారని, అది ఇష్టం లేక ఆ యువతి తల్లిదండ్రులు, బంధువులు, పోలీసులు తన కుమారున్ని చిత్రహింసలకు గురి చేశారని, ఎలాంటి కేసు నమోదు చేయకుండా నవీన్‌ను చిత్రహింసలకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. తమకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.



నవీన్‌ను పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవీన్, యువతి ప్రేమించుకుంటున్నారని, వారిద్దరూ మేజర్లని తెలిపారు. ఇరు కుటుంబాల బంధువులు, తల్లిదండ్రులు అంగీకారం తెలిపి వారికి పెండ్లి చేస్తే మంచిందని సూచించారు. ఈ విషయంలో పోలీసులు నవీన్‌ను యువతిని కిడ్నాప్ చేశావంటూ ప్రయివేట్ వ్యక్తులతో కలిసి కొట్టడం సరికాదన్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో బాధితుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిపారు. నిజంగా నవీన్‌ది తప్పుంటే చర్యలు తీసుకోవడంలో తప్పులేదని, కానీ ప్రేమించినందుకు హింసించడం దారుణమన్నారు. అమ్మాయిని పోలీసులు, ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ప్రయివేట్ వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరారు. ఆధారం లేకుండా నవీన్‌ను చితకబాదిన ఎస్ఐ, పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, హాలియా మండల కార్యదర్శి అవుతా సైదులు తదితరులు ఉన్నారు.